కథానిక

తెలివి తక్కువ కన్నయ్య

కొమ్మూరి వేణుగోపాలరావు

రాత్రి పన్నెండు గంటల సమయం. చీకటి గాంధాంధకారంగా వుంది. అక్కడక్కడ వీధి దీపాలు మాత్రం తమకాంతిని ప్రసారం చేస్తున్నాయి.

పోలీసు కాన్‌స్టేబులు కన్నయ్య తన నైట్ డ్యూటీని పూర్తి చేసుకుని త్వరగా యింటివైపు వస్తున్నాడు. అతను ఆ చీకట్లో నిర్భయంగా నడుస్తున్నాడు ఆలోచిస్తో. కన్నయ్య కాన్‌స్టేబులుగా చేరి ఏడాదయింది. మరి అతని దురదృష్టమో, చేతగానితనమో గాని "తెలివి తక్కువ కన్నయ్య" అని బిరుదు సంపాదించుకున్నాడు. దానికి కారణ మేమిటంటే అతను యీ ఉద్యోగంలో ప్రవేశించి ఏడాది దాటుతున్నా యింతవరకూ మంచి కేసు ఒక్కటీ పట్టుకోలేక పోవటమే. అందువల్లే పై అధికారులచేత రోజూ చివాట్లు తింటూ వుండేవాడు.

కన్నయ్య ఆలోచిస్తున్నాడు. తను తెలివి తక్కువ వాడా? తనకు ఒక కేసయినా దొరకనిదే ఆ తప్పు తనదెలా అవుతుంది? ఏదీ ఇప్పుడొక దొంగను కనిపించమను, ఎంత చమత్కారంగా పట్టుకుంటాడో! ఇంతకీ తనకు అదృష్టం లేదు. లేకపోతే ఆమాత్రం తెలీని వాడా తను.

కన్నయ్య జోరుగా సాగిపోతున్నాడు. ఎడం వైపు ఒక సందు వున్నది. అతని యింటికి పోవాలంటే ఆ సందులోంచే పోవాలి. ఆసందు ప్రక్కనే కొంచెం దూరంలో ఒక పెద్దమేడ వున్నది. కన్నయ్య సందు తిరగపోతూ అప్రయత్నంగా ఆ మేడ వైపు చూశాడు...

అంతే! తృళ్ళిపడి రక్కున ఆగిపోయాడు. ఆ పెద్ద మేడకు ఎదురుగా కొంత దూరంలో వీధిలో ఒక దీపం వున్నది. దాని కాంతిలో ఒక వ్యక్తి నల్లని కోటు ధరించి గబగబా వెళ్ళిపోతున్నాడు. కన్నయ్య అసలే అనుమానపు మనిషి, అందులో పోలీసు కాన్‌స్టేబులు. అర్ధరాత్రివేళ సంచరించటానికిగల కారణమేమయి వుంటుంది? ఒకవేళ దొంగకాదుగదా!

ఆలోచించుకోటానికి వ్యవధిలేదు. చకచకా ఆ చీకట్లో ముందుపోతున్న వ్యక్తిని అనుసరించసాగాడు. అతని బుర్రంతా ఆలోచనలతో నిండిపోయి వున్నది. తన ప్రతిభ మరునాటి వుదయంతో బయటపడిపోతుంది. ఆ పారిపోతున్నవాడు మంచి ఘోరం ఏమయినా చేసి వుంటే తను హెడ్‌గా యింకో మెట్టు పైకి ఎక్కవచ్చు. ఈఆలోచనలతో తను ఆదొంగను యింకా అనుసరించటమూ, వెంటనే పట్టేసుకోవటమూ, అర్థంగాక తికమక పడసాగాడు. దూరంగా లైటు వెలుగు కనిపిస్తోంది, మ్యునిసిపల్ దీపమే అయివుండవచ్చు. కన్నయ్య తనకు తను హెచ్చరించుకున్నాడు త్వరపడాలి. లేకపోతే కన్ను గప్పి వేయవచ్చు.

కన్నయ్య బాగా ధైర్యం తెచ్చుకుని అడుగులు జోరుగా వెయ్యటం, మొలలోని బాకుని తీసి సిద్ధంగాపట్టుకోవటం, ఆ బాకు ముందుపోతున్న వ్యక్తి వీపుకు గుచ్చుకోవటం, ఆవ్యక్తి భయంతో నిలిచిపోవటం ఇవన్నీ కొద్ది క్షణాలలో జరిగాయి.

"ఆగు, చేతులెత్తు".

ముందు వ్యక్తి స్టంటు సినిమాలలో వలె చేతులు పైకెత్తేసి గిరుక్కున వెనక్కి తిరిగాడు. కన్నయ్య తను చాల అనుభవం వున్నవాడివలె నటించసాగాడు.

"ఏం! ఏమాత్రం?"

ఆ వ్యక్తి కొంచెం భయంతో చూస్తున్నాడు. అతని శరీరంమీద విలువైన నల్లని కోటూ, తెల్లని ప్యాంటూ వున్నాయి.

ఆ వ్యక్తి అస్పష్టంగా అన్నాడు "నేనెవరో తెలుసా?"

"ఎందుకు తెలీదు! ఘనకార్యం చేసి వస్తున్నావు కాబోలు" కన్నయ్యసగర్వంగానవ్వాడు.

"ఏయ్ దొంగననుకున్నావేమిటి? పారి పోనులే. చేతులు దించనియ్యి. నెప్పి పుడు తున్నాయి."

కన్నయ్యకు జాలివేసింది. "దించు" అన్నాడు.

వెంటనే ఆ వ్యక్తి చేతులు దించివేసి కోటు సవరించుకుని ధైర్యంగా అన్నాడు. "ఆ... యిప్పుడు చెప్పు. నన్ను ఎవర్ననుకుని అడ్డగించావ్?" అతని కోటు అరిచేతులువరకూ వచ్చేసింది. యిదో ఫ్యాషన్ కాబోలు.

కన్నయ్య తన తెలివి వుపయోగించాడు. "తెలీదు. ఎవరివో చెప్పు" పాపం ఆ వ్యక్తి తడబడపడ్డాడు. "నేనా? నేను..." అని నసిగాడు.

"అపరాధ పరిశోధకుడివా?" అని వ్యంగ్యంగా నవ్వాడు కన్నయ్య.

"ఏం? ఎందుకు కాకూడదు?"

"చాలించవయ్యా యింక" అన్నాడు కన్నయ్య కొంచెం కోపంగా. "రా లైటులోకి రా. ఏమాత్రం సంగ్రహించావో చూడనీ!" అని భుజంమీద చెయ్యేసి దీపంక్రిందికి లాక్కుపోయాడు.

ఆ వ్యక్తి పూర్తిగా భయపడిపోయాడో, మరి నిర్భయంగానో కన్నయ్య చేస్తున్న పనికి ఏమాత్రం అంతరాయం కలిగించలేదు. కన్నయ్యకి యధేచ్ఛగా తన చేతులను కోటు కుడివైపు జేబులోనికి జొనిపి అక్కడున్న కాగితాలను బయటకు లాగాడు. కళ్లు చెదిరిపోయాయి. వందరూపాయలనోట్లు. లెక్కవేస్తే పదకొండు వున్నాయి. ఆశ్చర్యంతోనే ఎడంవైపు జేబులోకూడ చెయ్యి దూర్చి ఏదో బయటకు లాగాడు. అది ఒక డైరీ. దానిమీద "ఒ. విలాసరావు" అని వ్రాసివుంది. ఆశ్చర్యంతో డైరీ తెరిచాడు. మొదటి పేజీలో విజిటింగు కార్డు వున్నది. కన్నయ్య వింతపడి చదువుకున్నాడు.

అది చదివిన మరుక్షణంలో కన్నయ్య అదిరిపడ్డాడు. భయంతో ఒళ్లు కంపించిపోసాగింది. చటుక్కున రూపాయలూ, డైరీ కోటు జేబుల్లో కుక్కేసి, నిటారుగా నిల్చుని, కాళ్ళు క్రమంలో పెట్టి సెల్యూటు చేశాడు.

"క్షమించండి సార్. తమర్ని అనుమానించినందుకు మన్నించండి."

ఆ వ్యక్తి కోటు గుండీలు పెట్టుకుంటూ "అది నీధర్మం. నీ వృత్తి నువ్వు చేయాలి కదా" అన్నాడు.

"అలాకాదు సార్, మీరు తలుచుకుంటే నా వుద్యోగాన్ని కూడా పీకించెయ్యగలరు. మీరు సి. ఐ. సి. యినస్పెక్టరుగా ఈ వూరు వచ్చారని విన్నాను. కాని ఇంతవరకూ మిమ్మల్ని దర్శనం చేసుకోలేదు."

"దానికేమిల్లే. అయితే నేనింక వెళ్ళవచ్చునా?"

కన్నయ్య తలూపి చటుక్కున గుర్తువచ్చి అడిగాడు. "ఆ మేడ మీదేనా సార్?"

"అవును. ఏం?"

కన్నయ్య నసిగాడు. "అయితే యింత రాత్రివేళ..."

అతను నవ్వుతూ "అంతేనా? రాత్రివేళ బయటకు ఎందుకు వెళ్తారో వూహించుకోవోయ్" అని కన్ను గిలిపాడు. కన్నయ్య నవ్వుకుంటూ సెలవు పుచ్చుకుని బయలుదేరాడు.

"ఇంక నయం, అదృష్టవుండి యింకా మాటలు మిగిలానుగాను. ప్రమోషన్ మాట అటుంచి వున్న వుద్యోగం వూడిపోయేది. ఇంతకీ మన పేరు బయటపడే అవకాశంలేదు."

కన్నయ్య జోరుజోరుగా నడవసాగాడు. నిద్ర తూలుకువస్తున్నది. హఠాత్తుగా కన్నయ్య నిద్రమైకం వదిలి పోయింది. జాగ్రత్తగా చూశాడు. అప్పుడే తను విలాసరావు గారి మేడ దగ్గరకు వచ్చేశాడు. జనం గుంపులు గుంపులుగా మేడముందు గుమిగూడి వున్నారు. కన్నయ్య గబగబ జనాన్ని త్రోసుకుంటూ లోపలికి పోతున్నాడు.

"ఏమయిందండీ విలాసరావు గారూ! అసలు సంగతి ఏమిటి?" ఎవరో గుంపులోనించి అడిగారు.

మధ్యనుంచి మరోకంఠం జవాబిచ్చింది. "ఏమయిందేమిటండి? పదకొండువందల రూపాయలండీ! బీరువాలో సాయంత్రం పెట్టాను. పావుగంట ముందు మెలకువ వచ్చిందండి. చూద్దును గదా బీరువా తలుపులు బార్లా తీసివున్నాయి.

అందులోంచి అంతడబ్బూ తుపరమయిపోయిందండీ. ప్రక్కని నాకోటు పెట్టుకుంటే అదీ మాయమయింది."

కన్నయ్య తల తిరిగిపోయింది. నెమ్మదిగా వెనక్కివచ్చి సందులో పడిపోసాగాడు. ఐతే తనకి చిక్కిందెవరు? ఆ దొంగ వెధవేనా? ఎంత నాటకమాడాడు?

తనలో ఏవరో వెయ్యిగొంతుకలతో "తెలివి తక్కువ కన్నయ్యా" అని ఒకటే పనిగా అరుస్తున్నారు.

కథానిక

ఫలహారం మీద ప్రీతి

సత్యమూర్తి

ఆ ఊళ్ళో పెద్ద దేవాలయం ఉంది. పెద్దదే కాదు పేరుగలది కూడాను. పంచారామాలలో ఒకటి. విశాలమైన ప్రాకారాలు, కోనేరు, వీటినన్నిటినీ మించి అద్భుతమైన తెల్లటి పొడుగాటి శివలింగం ఆ గుడిలో ఆకర్షణీయమైన దృశ్యం. ఇంత ఘనత గలిగినదైనా ఒక్కలోటు కనబడుతూనే ఉంటుంది. ఆమహా దేవాలయం గ్రామంలో లేదు. గ్రామానికి దూరాన అంటే అరమైలు ఎడంగా విశాల ప్రదేశంలో నిర్మింపబడివుంది. తలనెరిసిన పెద్ద వాళ్ళంటారు, "గ్రామం ఆ గుడి చుట్టూరా ఉండేదట. రైలూ, కాలువ వచ్చిన తర్వాత కొత్తగా యిక్కడ కట్టుకున్నారు ఇళ్లు" అని. ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే ఎంతదూరమైనా కొందరు భక్తులు ప్రతిరోజూ కోనేరులో స్నానంజేసి గుడిగంటలు మ్రోగిస్తూనే ఉంటారు. కాని కార్తీక మాసం, మాఘ మాసాలలో గుడిగంటలు ఎక్కువసార్లు మ్రోగుతుంటాయి. ఆ గంటల మ్రోత సాధించే ఫలితం మాట ఎలావున్నా గంటల చప్పుడు విని ఊరిమొగదల యిండ్లున్న పిల్లలు జట్లుజట్లుగా గుడివైపు పరుగులెడతారు. కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు యీ బాల భక్తులను ఆహ్వానిస్తూ వుంటాయి. ఆ కొబ్బరి ముక్కలు, అరటి పండ్ల కొరకు పిల్లలు ఆరాటపడడం యీ నాటిది కాదు. కాటికి కాళ్ళు చాచుకు కూర్చున్న ముసలివాళ్లు కూడా గంట మ్రోతవిని "మా చిన్నతనంలో గంట టంగుమనేప్పటికి చెంగున గంతువేసి గుడిలో ప్రవేశించే వాళ్ళం" అని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటారు.

ప్రకాశం కలిగున్న వాళ్ళబిడ్డ. అయినంత మాత్రాన కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు ప్రకాశాన్ని ఆహ్వానించలేవని కాదు. ఆశకు కులభేదాలు అర్థభేదాలు వుండవు. చిన్నతనంలో బాల్యచేష్టలు అనే పేరిట ఒక వ్యక్తి వ్యక్తిత్వం ఆకారాన్ని సృష్టించుకొంటుంది. అట్లాంటి భావిస్వభావ సూచనలు ప్రకాశంలోనూ చూడొచ్చు.

ప్రకాశానికి మాఘ శనివారం పూర్తిగా సెలవురోజు. మాఘ శనివారంనాడు గుడిలో భక్తుల సంఖ్య హెచ్చుతుంది. దాంతో కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు గుట్టలు పడతాయి. ఆ రోజంతా ఊరి పిల్లలు దేవాలయ ప్రాంగణంలోనే ఉంటారు. ప్రకాశం రాత్రి పడుకుంటూనే అనుకున్నాడు. "రేపు తెల్లవారఝామునే లేచి ముందుగా ప్రయాణమై గుడికి పోతే కావలసినంత ఫలహారం తెచ్చుకోవచ్చు. ఏమాత్రం ఆలస్యమైనా శనివారం సెలవు మూలాన్ని ఆడపిల్లలు, మగాళ్లు అంతా జట్లు జట్లుగా వచ్చేస్తారు. అప్పుడుఫలహారం కాకెంగిలి చేస్తేనేగాని పంచుకతినడానికి వలనుపడదు. నేను లేచేప్పటికి ఒక్క ముసలి తాత మాత్రం మూలుగుతూ మెలకువగా ఉంటాడు. నే లేచినట్లు పసికట్టినా "ఎక్కడికిరా వెడుతున్నావు పుస్తకం తెచ్చుకొని చదువుకోరాదూ"